www.prajasakti.com
ప్రజాశక్తి
శనివారం 26 అక్టోబర్ 2024
5
అన్నమయ్య



రేపు ప్రొఫెసర్ సాయిబాబా సంస్మరణ సభ

ప్రజాశక్తి-రాయచోటి

పట్టణంలోని ఎన్‌జిఒ హోమ్‌లో ఆదివారం ఉదయం 10 గంటలకు ప్రొఫెసర్ సాయిబాబా సంస్మరణ సభ నిర్వహిస్తున్నట్లు ఉమ్మడి జిల్లా పౌరహక్కుల సంఘం కార్యదర్శి ఆర్.రవిశంకర్, ఉపాధ్యక్షులు పి.రెడ్డయ్య శుక్రవారం ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. ఢిల్లీ యూనివర్సిటీలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న సాయిబాబా దేశంలో పీడిత ప్రజల హక్కుల కోసం, కేంద్ర ప్రభుత్వం అభివృద్ధి పేరుతో దేశ సంపదను కార్పొరేట్లకు దోచిపెడుతున్న విధానాన్ని ఎండగడుతూ ప్రజలను చైతన్యం చేస్తూ ఉన్నారని పేర్కొన్నారు. ఇది నచ్చని కేంద్ర ప్రభుత్వం అక్రమంగా ఉపా కేసు పెట్టి నాగ్‌పూర్ జైల్లో పెట్టించిందన్నారు. పది సంవత్సరాలు జైలు శిక్ష తరువాత నిర్దోషి అని విడుదల చేసిందన్నారు. ఇటీవల ఆరోగ్యం క్షీణించి మరణించారన్నారు. ఆయన సంస్మరణ సభ ప్రజా సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సాయిబాబా సంస్మరణ సభలో ప్రజలు, ప్రజాసంఘాలు, ప్రజాస్వామిక వాదులు, విద్యార్థులు హాజరై జయప్రదం చేయాలని కోరారు.



గురుకుల పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న న్యాయమూర్తి మహేష్

గిరిజన గురుకుల ఆశ్రమ పాఠశాలలో జడ్జి తనిఖీ

ప్రజాశక్తి-పీలేరు

పట్టణంలోని గిరిజన బాలుర గురుకుల ఆశ్రమ పాఠశాలను 11వ అదనపు జిల్లా జడ్జి ఎ.మహేష్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ, చిత్తూరు జిల్లా కోర్టు ఆదేశాల మేరకు శుక్రవారం న్యాయమూర్తి స్థానిక మదనపల్లి మార్గంలోని ఆంధ్రప్రదేశ్ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్‌ను ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి గురుకుల వసతి గృహంలోని సౌకర్యాలు, సమస్యలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. మెనూ ప్రకారం విద్యార్థులకు పౌష్టిక ఆహారాన్ని అందిస్తున్నారా లేదా అని ఆరా తీశారు. నిబంధనల ప్రకారం విద్యార్థులకు అందివ్వాల్సిన ఆహారం, విద్యా సామగ్రి, ఇతర సౌకర్యాల గురించి అక్కడి పిల్లలను అడిగి తెలుసుకుంటూ, వారికి ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూడాలని ఆశ్రమ పాఠశాల ప్రిన్సిపల్, వసతి గృహ సంక్షేమ అధికారిణిలను ఆదేశించారు. న్యాయమూర్తి విద్యార్థులతో మాట్లాడుతూ చదువుతోపాటు ఆటల్లోనూ రాణించాలని తెలియజేశారు. పాఠశాల పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రెసిడెన్షియల్ స్కూల్ ప్రిన్సిపల్ ప్రసాద్ రావు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



బహుమతులు, సర్టిఫికెట్లు పొందిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

విద్యార్థులు చదువులో లక్ష్యాలను చేరుకోవాలి

ప్రజాశక్తి-రాయచోటి

ఉన్నత లక్ష్యాన్ని ఎంచుకొని చదివినప్పుడే ఉజ్వల భవిష్యత్‌కు అడుగు పడుతుందన్నారుని మానవత అధ్యక్షులు గాండ్లపేంట ఖాదర్ బాషా, మానవత చైర్మన్ ఆరమాటి శివగంగిరెడ్డి పేర్కొన్నారు. రాయచోటి మానవత సంస్థ ఆధ్వర్యంలో ఎపి మోడల్ స్కూల్‌లో విద్యార్థులకునైతిక విలువలపై అవగాహన కార్యక్రమం నిర్వహించి ఉత్తమైన పదవ తరగతికి సంబంధించిన నలుగురు విద్యార్థులకు మానవత ప్రశంస పత్రాలతో పాటు నగదు ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తల్లిదండ్రుల ఆశలు, గురువులు ఆశయాల అనుగుణంగా పిల్లలు నడుచుకోవాలన్నారు. లక్ష్యాన్ని ఎంచుకుని లక్ష్యాలను విస్మరించకండి సాదించినప్పుడే భవిష్యత్తులో ఉన్నతమైన స్థాయికి చేరుకోగలరన్నారు. మానవత సంస్థ పెద్దలు తమ పాఠశాలను గుర్తించి విద్యార్థిని, విద్యార్థులకు భవిష్యత్తులో ఉపయోగపడే విషయాలను తెలియజేసి విద్యార్థులను ప్రోత్సహించి నగదు ప్రోత్సాహకాలను నడజేసిన మానవత సంస్థ వారికి ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ రేఖ, మానవత సెక్రటరీ అంకం జయచంద్రారెడ్డి, గౌరవ అధ్యక్షులు వెంకటరమణ, ఉమ్మడి జిల్లాల ఉపాధ్యక్షులు బ్రహ్మానందరెడ్డి, మండల కన్వీనర్ చింతరెడ్డి వెంకట్రామిరెడ్డి, మాజీ అధ్యక్షులు గుండ్లూరు వెంకటేశ్, డైరెక్టర్ రామచంద్రారెడ్డి, ట్రెజర్ మురళీ, పాఠశాల వైఎస్ ప్రిన్సిపల్ ప్రసన్న కుమార్, సిబ్బంది సుబ్బారెడ్డి, గోపాల్ గౌడ్, రామకృష్ణ, సలోమి, లక్ష్మిప్రసన్న, గీతాంజలి, ఖానాం, రజనీకృష్ణ, సుభాషిణి, శారద, రహీమా, సహనాజ్ మహేశ్వరరెడ్డి, చిరంజీవి, విద్యార్థులు పాల్గొన్నారు.

డిసెంబర్ 1న భగవద్గీత శ్లోకాల కంఠస్థ పోటీలు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

గీతా జయంతిని పురస్కరించుకుని డిసెంబర్ 1వ తేదీ ఉదయం 9 గంటల నుంచి పట్టణంలోని మన్నూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు భగవద్గీత ఆరవ అధ్యాయంలోని శ్లోకాల పోటీలను నిర్వహిస్తున్నట్లు జిల్లా ప్రోగ్రామ్ అసిస్టెంట్ గోపి బాబు, ధర్మాచార్యులు గంగనపల్లి వెంకటరమణ ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్తు జిల్లా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ పోటీలలో విద్యార్థులు భగవద్గీత ఆరవ అధ్యాయం ఆత్మ సంయమయోగంలోని 47 శ్లోకాలను చెప్పాల్సి ఉంటుందన్నారు. 6, 7వ తరగతులు ఒక విభాగం గాను, 8, 9, 10వ తరగతులు ఒక విభాగంగాను పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సంపూర్ణ భగవద్గీత మీద 18 సంవత్సరాలలోపు వారు జూనియర్ విభాగంగా, 18 సంవత్సరాలు పైబడిన వారు సీనియర్ విభాగంగా పోటీలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ప్రతి విభాగం నుండి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను ఎంపిక చేస్తామన్నారు. జిల్లాలోని అన్ని పాఠశాలల యాజమాన్యాలు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు సహకరించి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. వివరాలకు టి.గోపిబాబు 9110779066, గంగనపల్లి వెంకటరమణ 9492562744 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

నిత్యావసర సరుకులు వితరణ

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్ : పట్టణంలోని దేవతా నగర్‌లోని చైతన్య స్వఛ్ఛంద సేవా సంస్థకు శుక్రవారం వెంకప్పకోట సచివాలయం పంచాయతీ సెక్రెటరీ కె.రవి, ఇంజినీరింగ్ అసిస్టెంట్ వి.మెహతాజ్, విలేజ్ సర్వేయర్ ఎం.భాస్కర్ నాయక్, మహిళా పోలీస్ అండ్ జిఎంఎస్‌కె డి.శ్రావణి కుమారి, డిజిటల్ అసిస్టెంట్ ఎస్.షాబీన్ తాజ్ చైతన్య స్వచ్ఛంద సేవా సంస్థను సందర్శించారు. చైతన్య స్వచ్ఛంద సేవాలో నిర్వహిస్తున్న విద్యా, వైద్యం, పోషకాహారం, ఆనంద వృద్ధాశ్రమంలోని వృద్ధుల గురించి సంస్థలో జరుగు వివిధ కార్యక్రమాలు, పిల్లల దినచర్య గురించి సంస్థ జనరల్ సెక్రటరి కవి తారాణి వివరించారు. ఆధార్ కార్డు లేని పిల్లల వివరాలు తెలియజేశారు. ఈ సందర్భంగా సెక్రటరీ కె.రవి మాట్లాడుతూ పిల్లలకు కావాల్సిన బర్త్ సర్టిఫికెట్లు, ఆధార్ కార్డులు, ఆరోగ్యం, విద్య పట్ల ప్రభుత్వం అందించే పథకాలు పిల్లలకు చేర వేసే విధంగా సహకరిస్తామని హామీ ఇచ్చారు. ఇంజినీరింగ్ అసిస్టెంట్ వి.మెహతా జన్మదినం సందర్భంగా పిల్లలకు అవసరమయ్యే నిత్యావసర సరుకులు అందజేశారు.



చైతన్య సంస్థలో సచివాలయ ఉద్యోగులు

ప్రభుత్వ భూముల నివేదికలు రూపొందించాలి

- కలెక్టర్ చామకూరి శ్రీధర్

ప్రజాశక్తి-రాయచోటి

వివిధ ప్రయోజనాల కోసం ప్రభుత్వ భూముల కేటాయింపులో తాజా స్థితిపై నివేదిక రూపొందించాలని కలెక్టర్ శ్రీధర్ అన్నారు. జిల్లా అభివృద్ధి కొరకు వివిధ ప్రయోజనాల నిమిత్తం బదలాయించిన ప్రభుత్వ భూ కేటాయింపులకు సంబంధించి అన్ని శాఖలు సమగ్రంగా నివేదిక రూపొందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని సమావేశ హాలులో జిల్లా స్థాయి మానిటరింగ్ అండ్ ఆడిట్ కమిటీ సమావేశాన్ని కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎపిఐఐసి, ఎపిఎండిసి, టూరిజం, వైద్యారోగ్యం, ఆర్టీసీ, పోలీస్, ఇతర విభాగాలకు కేటాయించిన భూములు వాటి విస్తీర్ణం, ఏ ప్రయోజనం కొరకు భూములు ఇచ్చారు, ప్రస్తుత వాటి స్థితిగతులపై కలెక్టర్ సమీక్షించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా అభివృద్ధి కొరకు వివిధ ప్రభుత్వ విభాగాలకు, ప్రైవేట్ సంస్థలకు భూమి కేటాయింపులు చేసి ఉన్నారు. భూ కేటాయింపులు చేసేటప్పుడు వాటి ఉద్దేశం ఖచ్చితంగా నెరవేరడానికి వాటి వినియోగానికి సంబంధించి వివిధ మార్గదర్శకాలను ప్రభుత్వం జారీ చేసి ఉంది. గత పది సంవత్సరాలలో జిల్లాలో వివిధ విభాగాలకు ఇచ్చిన స్థలాలను గుర్తించాలని, ఏ ప్రయోజనం కొరకు ఆ భూములు ఇచ్చారు, అది నెరవేరిందా లేదా అన్న అంశంలో జిల్లా స్థాయి మానిటరింగ్ అండ్ ఆడిట్ కమిటీ సమీక్షించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించిందన్నారు. ఆయా శాఖల పరిధిలో జరిగిన భూ బదలాయింపులకు సంబంధించి అవి ఏ స్టేజ్ లో ఉన్నవి, భూ కేటాయింపు ఉద్దేశం నెరవేరిందా లేదా, ఇంకను ఎలాంటి ప్రగతి లేకుంటే అందుకు సంబంధించిన కారణాలు తదితరాలతో సంపూర్తి నివేదిక సమర్పించాలన్నారు. ఇకపై నిర్ణీత కాలంలో జిల్లా స్థాయి మానిటరింగ్ అండ్ ఆడిట్ కమిటీ సమావేశాలను క్రమం తప్పకుండా నిర్వహించాలని పేర్కొన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, సబ్ కలెక్టర్లు మేఘస్వరూప్, నైదియా దేవి, ఆర్డీవో రంగస్వామి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

నవంబర్ 14న పేరెంట్స్ టీచర్ల సమావేశం : ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాల మేరకు నవంబర్ 14న జిల్లాలో నిర్వహించే పేరెంట్స్, టీచర్ల మెగా సమావేశానికి ముందస్తు ఏర్పాట్లు పక్కాగా పూర్తి చేయాలని కలెక్టర్ శ్రీధర్ విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. విజయవాడ నుంచి మెగా డీఎస్సీ, నవంబర్ 14న పేరెంట్స్ టీచర్ల మెగా సమావేశం, విద్యార్థులకు అపార్ యూనిక్ ఐడి జారీ తదితర అంశాలలో ప్రభుత్వ స్కూల్ ఎడ్యుకేషన్ కార్యదర్శి కోనశశిధర్ జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం 16347 మందితో మెగా డీఎస్సీని ప్రకటించిన విషయం విధి తమే. ఈ మెగా డీఎస్సీ నిర్వహణలో ఎక్కడ పొరపాట్లకు తావు లేకుండా పటిష్టంగా నిర్వహిం చాలి. ఇందుకు అన్ని ఏర్పాట్లు పటిష్టంగా పూర్తి చేసుకోవాలి. ప్రభుత్వం జారీ చేసిన జీవో మేరకు కలెక్టర్ల అధ్యక్షతన రోస్టర్ కమిటీని నియమించాలి. జీవో మేరకు రిజర్వేషన్ రోస్టర్ పాయింట్లను నిర్ణయించాలని తెలిపారు. ఈ అకాడమిక్ సంవత్సరానికి సంబంధించి ఫీజు రియంబర్స్మెంట్ త్వరలో విడుదల చేయడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. అలాగే పాత బకాయిల అంశంలో కూడా ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఒకే దేశం, ఒక విద్యార్థి ఐడి కింద ఒకటి నుంచి 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ఆటోమేటెడ్ పర్మనెంట్ అకాడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ (అపార్) యునిక్ ఐడి జారీ కొరకు ఖచ్చితమైన డేటా రూపొందించాలని ఆదేశించారు. "పిల్లల బంగారు భవిష్యత్తు కోసం- బడివైపు అడుగులు" నినాదంతో నవంబర్ 14న మెగా పేరెంట్స్ టీచర్ల సమావేశాన్ని నిర్వహించాలని, ఇందుకు సంబంధించిన ముందస్తు ఏర్పాట్లు అన్ని పూర్తి చేసుకోవాలని పేర్కొన్నారు. ఆయా అంశాలలో తీసుకోవాల్సిన చర్యలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. విసి అనంతరం విద్యాశాఖ అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ మార్గదర్శకాలను దృష్టిలో ఉంచుకొని మెగా పేరెంట్స్ టీచర్ల సమావేశం నిర్వహించేందుకు ముందస్తుగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. విద్యార్థులకు జారీ చేయబోయే యూనిక్ ఐడి నిమిత్తం ఖచ్చితమైన డేటా రూపొందించాలని సూచించారు. ప్రభుత్వం ఆదేశించిన మేరకు మెగా డీఎస్సీకి సంబంధించి రోస్టర్ కమిటీ ఏర్పాటుకు తగు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పేర్కొన్నారు. అనంతరం వివిధ అంశాలలో తగు సూచనలు జారీ చేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్

పశుగణనకు పాడి రైతులు సహకరించాలి

- జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి గుణశేఖర్



పశుగణను పరిశీలిస్తున్న జిల్లా అధికారి గుణశేఖర్

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

21వ అఖిలభారత పశుగణన-2024 కార్యక్రమానికి పశు వైద్యాధికారులు గ్రామాలకు వచ్చినప్పుడు పాడి రైతులు సహకరించాలని పశు సంవర్ధక శాఖ జిల్లా అధికారి కె.గుణశేఖర్ పిళ్లై తెలిపారు. ఈ నెల 16వ తేదీ నుంచి జిల్లా వ్యాప్తంగా జరుగుతున్న నట్టల నివారణ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఆయన రాజంపేట డివిజన్ కేంద్రాన్ని సందర్శించారు. పశువైద్యాధికారులు, సిబ్బందితో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. పశుగణన కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లు ఆవిష్కరించారు. అనంతరం కూచివారిపల్లెలో నట్టల నివారణ కార్యక్రమంలో పాల్గొని పశువులకు మందులు తాపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నట్టల నివారణ మందులను ప్రభుత్వం రెండు దపాలుగా ఉచితంగా అందజేస్తుందని పేర్కొన్నారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి జీవాలకు నట్టల నివారణ మందులు తాపించాలన్నారు. మిగిలిన రెండు దఫాలు పాడి రైతులు మందులు కొనుగోలు చేసి పశువులకు ఇవ్వాలని సూచించారు. పశుగణన కార్యక్రమం పారదర్శకంగా నిర్వహించాలని పశు వైద్య అధికారులకు సూచించారు. కార్యక్రమంలో డివిజన్ పశుసంవర్ధక శాఖ ఉపసంచాలకులు డాక్టర్ ఎన్.సురేష్ రాజు, సహాయ సంచాలకులు డాక్టర్ కె.ప్రతాప్, డాక్టర్ భాగ్యవతి, జెవిఒ ఎం.వరదయ్య, ఎల్ఎస్ఎ బసవరాజు, పశు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

తంబళ్లపల్లి : పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో జరిగే పశుగణనను పకడ్బందీగా నిర్వహించాలని ఆ శాఖ ఎడి డాక్టర్ సుమిత్ర కోరారు. పశు వైద్యశాల ఎడి కార్యాలయంలో ఎన్యుమరైటర్స్‌తో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్యుమరైటర్లు ఫిబ్రవరి 28 తేదీ 2025 వరకు పశుగణన నిర్వహించాలన్నారు. ప్రతి రోజు 20 ఇళ్లను సందర్శించి వారికి ఉన్న పశువులు, మేకలు, కోళ్లు, ఇంకా పెంపుడు జంతువులు ఉంటే వాటి పూర్తి వివరాలను నివేదికలో పొందుపరచాలన్నారు. ఈ పశుగణనతోనే మండలానికి రావాల్సిన ప్రభుత్వ పథకాలు, మందులు, అభివృద్ధి నిధులు మంజూరు అవుతాయన్నారు. పశు వైద్య సిబ్బంది కచ్చితంగా పశుగణాన నిర్వహించాలన్నారు. అనంతరం పశు గణన వాల్ పోస్టర్లను ఆవిష్కరించి ఎన్యుమరేటర్లకు కిట్ బ్యాగులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపిడిఒ ఉపేందర్‌రెడ్డి, ఉపాధి హామీ ఎపిఒ అంజనప్ప, పశు వైద్యురాలు డాక్టర్ సుజనశ్రీ పాల్గొన్నారు.

కలికిరి: పశుగణన కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని మర్రికుంటపల్లి సర్పంచ్ రెడ్డిరామ్ కోరారు. మండలంలోని మర్రికుంటపల్లి పంచాయతీ ఎల్లంపల్లి గ్రామంలో పశుగణన కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల రైతులు పశుగణనకు పశు వైద్య సిబ్బందికి సహకరించాలని, సిబ్బంది జాగ్రత్తగా కచ్చితంగా పశు గణన చేయాలని కోరారు. కార్యక్రమంలో సహాయ సంచాలకులు డాక్టర్ కె.వెంకటముని నాయుడు పాల్గొన్నారు.

ఉచిత పంటల బీమాకు మంగళం : 'గడికోట'

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

ఉచిత పంటల బీమాకు కూటమి ప్రభుత్వం మంగళం పాడిందని వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ వ్యవసాయం దండగ అంటూ గతంలోనే వ్యాఖ్యానించిన చంద్రబాబు రైతు వ్యతిరేఖ విధానాలనే కొనసాగిస్తూ రైతుల నడ్డి విరుస్తున్నారన్నారు. అన్నదాతలపై పైసా భారం పడకుండా జగన్ ప్రభుత్వం ఐదేళ్లు విజయవంతంగా అమలు చేసిన వైఎస్ఆర్ ఉచిత పంటల బీమాకు తాజాగా మంగళం పాడారన్నారు. ఈ పథకం ఎత్తివేసే కుట్రలో భాగంగా పంటల బీమాపై అధ్యయనం కోసం చంద్రబాబు ప్రభుత్వం పౌరసరఫరాలు, ఆర్థిక శాఖ మంత్రులతో క్యాబినెట్ సబ్ కమిటీ వేసిందని,ప్రభుత్వ సూచన మేరకు ఈ సబ్ కమిటీ రైతులకు వ్యతిరేఖంగా నివేదికను సమర్పించిందన్నారు.ఈ పథకం స్థానంలో 2019కి ముందున్న రైతుల భాగస్వామ్యంతో అమలైన ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజనను అమలు చేయనున్నారన్నారు. అధికారంలోకి వచ్చి నాలుగు మాసాలు పూర్తయినా రైతుకు ఎలాంటి సాయం అందించలేదన్నారు. ఈ అక్టోబర్ నుంచి మొదలైన రబీ పంటలకు, రాబోయే సీజన్‌లో పెట్టే పంటలకూ సంబంధించి అన్నదాతలపై బీమా ప్రీమియం భారం మోపారన్నారు.గత ఐదేళ్లు వైఎస్ జగన్ ప్రభుత్వంలో ఉచిత పంటల బీమా అమలుతో పాటు పెద్ద ఎత్తున పరిహారం తీసుకుంటూ, ఏ సీజన్‌లో పంట దెబ్బతింటే ఆ సీజన్ ముగిసేలోగా పరిహారం అందుకుంటూ ప్రశాంతంగా ఉన్న రైతుల నెత్తిన ఒక్కసారిగా పిడుగు వేశారన్నారు. ఇక నుంచి ప్రీమియం కడితే తప్ప బీమా వర్తించదని ఈ ప్రభుత్వం తేల్చి చెప్పిందన్నారు.

భూ సమస్యల పరిష్కారానికి గ్రామసభలు

ప్రజాశక్తి-పీలేరు

రీ సర్వేలో ఎదురైన భూ సమస్యలను పరిష్కరించుకోడానికి ప్రభుత్వం కల్పించిన ఈ సువర్ణ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని పీలేరు రీ సర్వే డిప్యూటీ తహశీల్దారు సుబ్రమణ్యం తెలిపారు. శుక్రవారం మండలంలోని మద్దెలచెరువుపాలెం రెవెన్యూ గ్రామంలో రీ సర్వేలో వచ్చిన సమస్యల పరిష్కార కార్యక్రమంపై గ్రామసభను నిర్వహించారు. ఈ సందరరేగా రైతులు తమ సమస్యలను రెవెన్యూ అధికారులకు లిఖితపూర్వకంగా అందజేశారు. రీ సర్వే డిప్యూటీ తహశీల్దారు మాట్లాడుతూ మద్దెలచెరువు రెవెన్యూ గ్రామం పూర్తి విస్తీర?ం 1020.93 ఎకరాల 914 ఎల్.పి.ఎంలు ఉందని అన్నారు. వివిధ సమస్యలపై రైతుల నుంచి 60 అర్జీలు అందాయని తెలియజేశారు. ఇందులో విస్తీర్ణ సవరణ కోసం 39 అర్జీలు, జాయింట్ ఫీల్డ్ విభజన కోరుతూ 11, జాయింట్ ఫీల్డ్ మ్యుటేషన్ కోరుతూ ఒక్క అర్జీ, మ్యుటేషన్ కరక్షన్ కోసం 3 అర్జీలు, కో రిలేషన్ సవరణకై 2, ఫోటో, మొబైల్ నెంబరు, పట్టాదారు సవరణ కోరుతూ 3 అర్జీలు వచ్చాయని చెప్పారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ కిరణ్మయి, పంచాయతీ కార్యదర్శులు ఫరూక్, మహేష్, గ్రామ సర్వేయర్లు, తదితరులు పాల్గొన్నారు.

రేపు ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

చెన్నై శంకర్ నేత్రాలయ ఆధ్వర్యంలో 27వ తేదీ స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు చిన్ని తెలిపారు. శంకర్ నేత్రాలయ ద్వారా ఇప్పటికే వేల మందికి దృష్టి లోపాలు తగ్గించి, ఉచిత కంటి శస్త్ర చికిత్సలు చేసి చూపును అందించడం జరిగిందన్నారు. కంటిలో శుక్లం ఉన్నవారు, కంటి చూపు తగ్గి ఇబ్బందులు పడుతున్న వారు ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆదివారం ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు శిబిరం ఉంటుందన్నారు.

నాయీ బ్రాహ్మణులకు చోటు హర్షణీయం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

నాయీ బ్రాహ్మణులకు అన్ని దేవాలయాల్లోని పాలక మండలి సభ్యులుగా అవకాశం కల్పించే విధంగా తీర్మానం చేయటం మంచి శుభపరిణామమని రాష్ట్ర నాయీ బ్రాహ్మణ సాధికార సమితి సోషల్ మీడియా కో-ఆర్డినేటర్ ప్రభాకర్ అన్నారు. శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేవాలయాల పాలక మండలిలో సభ్యులుగా నాయీ బ్రాహ్మణులకు అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకి కృతజ్ఞతలు తెలిపారు. దేవాలయాల్లో పని చేసే నాయీ బ్రాహ్మణులకు ఇప్పటికే రూ.25 వేలు ప్రకటించి నందుకు హర్షం వ్యక్తం చేస్తూ వాయిద్య కళాకారులకు, వృత్తిదారులకు, ఉద్యోగ భద్రత, గత వైసిపి ప్రభుత్వంలో రద్దు చేసిన నాయీ బ్రాహ్మణులకు చెందిన అన్ని జీవోలను మళ్లీ అమలులోకి తెచ్చే విధంగా కృషి చేయాలన్నారు. కార్పొరేట్ సంస్థల స్థాయిలో సెలూన్ షాపులు ఏర్పా టుకు ప్రభుత్వం సహకారం అందించ నున్నదని తెలిపారు. పోలీస్ బార్బర్ నియామకం కోసం ఇచ్చిన జీవో నెంబర్ 26ను అమలుతోపాటు నాయీ బ్రాహ్మణులకు టిడిపి ప్రభుత్వం ఎప్పుడూ అండగా ఉంటుందని స్పష్టం చేశారు.

పసుపులేటి శంకర్‌కు అభినందనల వెల్లువ

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్: ఆంధ్రరత్న పురస్కారం అందుకున్న రాజంపేట స్పెషల్ జ్యూడిషియల్ మేజిస్ట్రేట్ పసుపులేటి శంకర్‌కు అభినందనలు వెల్లువెత్తాయి. రాజంపేట న్యాయవాదులు శంకర్‌ను ఆయన చాంబర్లో కలిసి అభినందనలు తెలుపారు. కడప జిల్లా న్యాయవాదుల బార్ అసోసియేషన్ అధ్యక్షులు బొగ్గుల గుర్రప్ప నాయుడు శంకర్‌ను కలిసి ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. ఉమ్మడి కడప జిల్లా వాసికి పురస్కారం రావడం ఈ ప్రాంత వాసులకు గర్వకారణమని పేర్కొన్నారు.



శంకర్‌ను అభినందిస్తున్న గుర్రప్ప



పాదయాత్రలో శ్రీనివాసులు, వాల్మీకులు

వాల్మీకుల హక్కుల సాధనకు పోరాటాలు

- వాల్మీకి సంఘం రాష్ట్ర అధ్యక్షులు శ్రీనివాసులు

ప్రజాశక్తి-మదనపల్లి

దశాబ్దాలుగా వాల్మీకులకు జరుగుతున్న అన్యాయంపై ప్రభుత్వాలపై పోరాటం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని వాల్మీకి సంఘం ఆంధ్రప్రదేశ్ అధ్యక్షులు పులి శ్రీనివాసులు పేర్కొన్నారు. వాల్మీకుల ఎస్టీ పునరుద్ధరణ, నామినేట్ పదవులు, స్థానిక సంస్థలలో సముచిత స్థానం లక్ష్యంగా వాల్మీకి సంఘం ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో కర్ణాటక రాష్ట్రం రాయల్పాడు నుండి చేపట్టిన పాద యాత్రకు కర్నాటక రాష్ట్రంలోని వాల్మీకి సంఘాలు మద్దతు ప్రకటించారు. వాల్మీకి సంఘం ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో రాయలపాడు క్రాస్ నుండి మదనపల్లె, పుంగనూరు మీదుగా బోయకొండ గంగమ్మ ఆలయానికి పాదయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా కర్ణాటక వాల్మీకి నవ సమాజ సంఘం స్టేట్ యూత్ ప్రెసిడెంట్ వెంకట్, వాల్మీకి సంఘం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు పులి శ్రీనివాసులు మాట్లా డుతూ పాదయాత్రలో భాగంగా శుక్రవారం మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్ బాషా, శనివారం పుంగనూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి చల్లా బాబురెడ్డి, ఆదివారం బోయకొండ గంగమ్మకు వినతిపత్రం అందజేస్తామని వివరించారు. వాల్మీకి సంఘం ఆంధ్రప్రదేశ్ ప్రధాన లక్ష్యం వాల్మీకుల ఎస్టీ పునరుద్ధరణేనన్నారు. దేశ వ్యాప్తంగా వాల్మీకుల మద్దతు కోరుతూ కర్ణాటక రాష్ట్రంలోని రాయలపాడు నుంచి పాదయాత్ర ప్రారంభించడం జరిగిందని, కర్ణాటక రాష్ట్రంలోని వాల్మీకులు తమకు మద్దతు ఇవ్వడం జరిగిందని తెలిపారు. వాల్మీకుల ఎస్టీ పునరుద్ధరణ తోపాటు బోయకొండ గంగమ్మ చైర్మన్, మదనపల్లె మార్కెట్ యార్డ్ చైర్మన్, మదనపల్లె, పుంగనూరు మున్సిపల్ చైర్మన్లు, జడ్పిటిసి, ఎంపిపి పదవులలో బోయలకు అధిక పదవులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ పాదయాత్రలో కర్ణాటక వాల్మీకి నవ సమాజ సంఘం స్టేట్ కన్వీనర్ నాగరాజు, శ్రీనివాసపురం తాలూకా ప్రెసిడెంట్ లక్ష్మీనారాయణ, రాష్ట్ర మహిళా అధ్యక్షులు మంజుల, ప్రదీప్, శ్రీనివాసులు, వాల్మీకి యువకర సంఘం జనరల్ సెక్రెటరీ కోటే శ్రీనివాస్, వాల్మీకి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు సద్దల జయసింహ, వలసల మంజునాథ్, ముక్కండ్ల జగదీష్, పారేసు కృష్ణమూర్తి, అరవ నిర్మలమ్మ, బొంత సోము, బొంత రామకృష్ణ, పారపట్ల నరసింహులు, పత్తేపురం నారాయణ, పుర్ర చలపతి వాల్మీకులు పాల్గొన్నారు.



ఉత్తమ ప్రిన్సిపల్ అవార్డు స్వీకరిస్తున్న ప్రిన్సిపల్ యువరాజ్

'మిట్స్' ప్రిన్సిపల్‌కు ఉత్తమ అవార్డు ప్రదానం

ప్రజాశక్తి-మదనపల్లి

అంగళ్లలోని మదనపల్లె ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి.యువరాజ్ రాష్ట్ర స్థాయి ఇండియన్ సొసైటీ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (ఐఎస్‌టిఇ-2024) బెస్ట్ ప్రిన్సిపల్ అవార్డును కర్నూల్‌లోని జి.పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కాలేజీలో అనంతపురం జెఎన్‌టియు వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ సుదర్శన్‌రావు చేతుల మీదుగా అందుకున్నారు. ఇదే కార్యక్రమంలో బి.టెక్ ఇఇఇ చదివిన కాగితి భార్గవికు బెస్ట్ ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ విద్యార్థి-2023 అవార్డు, కంప్యూటర్ సైన్స్, ఇంజినీరింగ్ చదివిన కార్తీక్ కోవికి బెస్ట్ స్టూడెంట్ ఇన్నోవేటర్-2023 రాష్ట్ర అవార్డులు అందుకున్నారు. ఈ సంవత్సరం గాను మూడు అవార్డులను దక్కిన్చుకోవడం ఆనందంగా ఉందని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి.యువరాజ్ అన్నారు. కళాశాల కరెస్పాండంట్ డాక్టర్ ఎన్.విజయ భాస్కర్ చౌదరి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కీర్తి నాదెళ్ల, అధ్యాపకులు, విద్యార్థులు అవార్డులు అందుకున్న ప్రిన్సిపల్ డాక్టర్ సి.యువరాజ్, కాగితి భార్గవి, కార్తీక్ కోవిలను అభినందించారు.

టిడిపి సభ్యత్వం భవిష్యత్తుకు భరోసా

- జిల్లా అధ్యక్షులు చమర్తి జగన్‌మోహన్‌రాజు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

టిడిపి పార్టీలో సభ్యత్వ నమోదు కార్యకర్తల భవిష్యత్తుకు బంగారు బాట వేస్తుందని టిడిపి రాజంపేట పార్లమెంట్ జిల్లా అధ్యక్షులు చమర్తి జగన్ మోహన్‌రాజు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కార్యకర్తల భవిష్యత్తుకు ఎల్లప్పుడూ విలువ నిచ్చే టిడిపి పార్టీలో సభ్యునిగా చేరడం అంటే వారి భవిష్యత్తుకు భరోసా ఏర్పాటు చేసుకోవడమేనన్నారు. 26వ తేదీ నుండి సభ్యత్వ నమోదులో ఉన్న టిడిపి నాయకులు కార్యకర్తలతో పాటు సామాన్య ప్రజలు కూడా పాల్గొని సభ్యత్వం నమోదు చేసుకోవాలన్నారు. ఒక్కసారి టిడిపి సభ్యత్వం పొందితే వారికి రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న కోట్లాది మంది టిడిపి నాయకులు, కార్యకర్తలతో పాటు అధినేత చంద్రబాబు భరోసా ఉన్నట్లేనని, పెద్ద ఎత్తున రాజంపేట పార్లమెంట్ వ్యాప్తంగా ప్రతి మండలంలోని సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తెలిపారు. కార్యకర్తల కష్టనష్టాలలో ఎల్లప్పుడూ అండగా ఉండే పార్టీలో కుటుంబ సభ్యునిగా చేరే అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పోలీసులకు వ్యాసరచన పోటీలు

ప్రజాశక్తి - రాయచోటి టౌన్ : పోలీసు అమరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా ఎస్‌పి వి.విద్యాసాగర్ నాయుడు ఆదేశాల మేరకు శుక్రవారం జిల్లా కేంద్రంలోని పోలీసు కార్యాలయంలో పోలీసు అధికారులు, సిబ్బందికి వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణలో పోలీసులకు సవాళ్లు అనే అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీలలో ప్రతిభ కనబర్చిన వారికీ ఎస్పీ చేతుల మీదుగా ప్రశంసాపత్రం, బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. ఈ వ్యాసరచన పోటీలలో పోలీసులకు ప్రభుత్వ ఉపాధ్యాయులు, ఎఆర్ డిఎస్పీ చిన్నికృష్ణ పర్యవేక్షణ చేశారు. కార్యక్రమంలో ఆర్ఐ రామకృష్ణ, ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు ఎస్.ఆంజనేయులు, బిఎస్.పద్మావతి, పి.రాజా, ఎన్.ఆరిపుల్లా ఖాన్, ఎస్.సజ్జద్, ఆర్ఎస్ఐలు అమర్నాథ్‌రెడ్డి, రవి, అల్లావుద్దీన్, హజరత్ అయ్యా, సివిల్ ఎఆర్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



వ్యాసరచన పరీక్ష రాస్తున్న పోలీసులు



సిసి రోడ్డుకు భూమిపూజ చేస్తున్న ముక్కా వరలక్ష్మి

డ్రెయినేజీ, సిసి రోడ్లకు భూమిపూజ

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

మండలంలోని మైసూరివారిపల్లెలో రెండు కోట్ల రూపాయల వ్యయంతో డ్రెయినేజీ కాలువలు, సిమెంటు రోడ్లు ఏర్పాటు చేయనున్నట్లు టిడిపి ఇన్‌ఛార్జి ముక్కా రూపానందరెడ్డి, ఎమ్మెల్యే అరవ శ్రీధర్ తెలిపారు. శుక్రవారం ఈ పనులకు సతీమణి వరలక్ష్మి, ఎమ్మెల్యే శ్రీధర్, సర్పంచ్ సంయుక్తలు భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాబోయే రోజుల్లో నియోజకవర్గంలోని ప్రతి పల్లెను అభివృద్ధి చేసామని రూపానందరెడ్డి తెలిపారు. గత వైసిపి ప్రభుత్వ చీకటి పాలనతో చితికిపోయిన గ్రామాలను అభివృద్ధి చేయడానికి కృషి చేస్తున్నామని అన్నారు. మైసూరివారిపల్లి రెండు కోట్ల రూపాయలు వ్యయంతో డ్రెయినేజీ కాలవలు, సిసి రోడ్డు నిర్మాణానికి భూమి భూమిపూజ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ డిఇ బాలనరసింహులు, ఎంపిడిఓ నాగార్జునరావు, కూటమి స్వరూపరాజు సుబ్బ రాజు, కట్టా గుండయ్య నాయుడు, టి.నాగేంద్ర, పి.చంద్రశేఖర్, టి వెంక టేష్, జోగినేని మణి, కె.రామ రాజు, నాగరాజు, ఉత్తరాది శివ పాల్గొన్నారు.



హరిని పరామర్శిస్తున్న శ్రీనివాసరాజు

కార్యకర్తకు 'యల్లటూరు' పరామర్శ

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

రోడ్డు ప్రమాదంలో గాయపడిన జనసేన కార్యకర్త నంద్యాల హరిని శుక్రవారం జనసేన పార్టీ రాజంపేట పార్లమెంటు సమన్వయకర్త యల్లటూరు శ్రీనివాసరాజు కలిసి పరామర్శించారు. అధైర్య పడవద్దు నేనున్నానని భరోసా కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హరి జనసేన పార్టీ మద్దతు దారుగా గతంలో సర్పంచ్‌గా పోటీ చేసి పార్టీ బలోపేతానికి కృషి చేశాడని అన్నారు. రోడ్డు ప్రమాదం గాయపడటంపై విచారం వ్యక్తం చేశారు. కార్యక్ర మంలో జనసేన నాయకులు కోలాటం హరికృష్ణ, పెడగాల సుధాకర్, మాజీ సర్పం చ్ సమ్మెట శివప్రసాద్, పివిఆర్ కుమార్, నారదాసు రామచంద్ర పాల్గొన్నారు.



విద్యార్థినికి ప్రశంసా పత్రాన్ని అందిస్తున్న ఎస్ఐ మోహన్‌కుమార్ గౌడ్

సైబర్ నేరాలపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

ప్రజాశక్తి-పుల్లంపేట

ఎస్‌బివిడి సభ జూనియర్ కళాశాలలో శుక్రవారం విద్యార్థులకు సైబర్ నేరాలపై ఎస్ఐ మోహన్‌కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ ఎం.బాలాజీరాజు మాట్లాడుతూ నేటి యువతకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించడానికే ఈ వ్యాసరచన పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. అంతర్జాలంలోనూ, సామాజిక మాధ్యమాలలోనూ వచ్చే సందేశాలను గుడ్డిగా విశ్వసించకూడదని అన్నారు. ప్రజలను మోసగించడానికి సైబర్ నేరు గాళ్లు వివిధ రూపాలలో ఎత్తులు వేస్తారని చెప్పారు. ఈ నేరాల పట్ల యువత అప్రమత్తంగా ఉంటూ సమాజాన్ని కూడా అప్రమత్తం చేయాల్సిన బాధ్యత ఉందని తెలియజేశారు. వ్యాసరచన పోటీలలో ప్రథమ బహుమతి ఎ.శ్రావిక, ద్వితీయ బహుమతి ఎస్. బ్రాహ్మణి, తృతీయ బహుమతి ఇ.ప్రవీణ్ కుమార్ ఎంపికైనట్లు చెప్పారు. ఎంపికైన విద్యార్థుల పత్రాలను డిఎస్‌పి కార్యాలయానికి పంపించడం జరుగుతుందని తెలిపారు.



మెమోంటో, ప్రశంసా పత్రం అందుకుంటున్న సుదర్శన్‌నాయక్

జాతీయ స్థాయి క్రీడలకు 'గురుకుల' విద్యార్థి ఎంపిక

ప్రజాశక్తి-తంబళ్లపల్లె

తంబళ్లపల్లి గిరిజన గురుకుల పాఠశాల విద్యార్థి సుదర్శన్ నాయక్ శుక్రవారం కర్నూల్ లో జరిగిన ఎస్‌జిఎఫ్ఐ రాష్ట్ర స్థాయి అండర్-19 ట్రిపుల్ జంప్ పోటీలలో రెండవ స్థానంలో నిలిచి జాతీయస్థాయి క్రీడలకు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ షబానా తెలిపారు. ట్రిపుల్ జంప్ విభాగంలో రాష్ట్ర స్థాయిలో 12.45 మీటర్లు జంప్ చేశాడని పేర్కొన్నారు. రాష్ట్రస్థాయిలో విజయం సాధించి జాతీయ స్థాయికి అర్హత సాధించాడని హర్షం వ్యక్తం చేశారు. నవంబర్ 25న రాంచీలో జరిగే జాతీయ స్థాయి పోటీలో పాల్గొంటాడని తెలిపారు. జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన సుదర్శన్‌నాయక్‌ను పిఇటి దేశ్‌ముఖ్, ఎంఇఒలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

బకాయిలను వెంటనే చెల్లించాలి

ప్రజాశక్తి-పుల్లంపేట

రాష్ట్రోపాధ్యాయ సంఘం పుల్లంపేట మండల కార్యవర్గ సమావేశం స్థానిక ఎంఆర్‌సిలో శుక్రవారం సాయంత్రం జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు నరేంద్రనాథ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు బి. నరేంద్రనాథ్ మాట్లాడుతూ సిపిఎస్ ఉపాధ్యాయులకు రెండు డిఎల ఆర్థిక బకాయిలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. పిఆర్‌సి ప్రకటన ఆలస్యం కానున్న నేపథ్యంలో 30 శాతం మధ్యంతర భృతిని వెంటనే ప్రకటించాలన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సయ్యద్ సర్తాజ్ హుస్సేన్, వి.సిద్దయ్య, ఆర్థిక కార్యదర్శి శివరాంప్రసాద్, ఉపాధ్యాయ వాణి కన్వీనర్ ఎం.శ్రీనివాసులు పాల్గొన్నారు.

రైల్వే అండర్ బ్రిడ్జి ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి-పుల్లంపేట : మండల పరిధిలోని అప్పయ్య రాజుపేట వద్ద జరుగుతున్న రైల్వే అండర్ బ్రిడ్జి పనులను రాజంపేట సబ్ కలెక్టర్ వైఖోమ్ నదియాదేవి ఆకస్మికంగా తనిఖీ చేశారు. అండర్ బ్రిడ్జి పనులకు సంబంధించిన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. నిర్దేశించిన సమయానికి నిర్మాణం పూర్తి కావాలని ఆదేశించారు.కార్యక్రమంలో తహశీల్దార్ అరవిందకిషోర్, ఆర్ఐ సుశీల్‌కుమార్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరిస్తాం : 'ముక్కా'

ప్రజాశక్తి-పుల్లంపేట

ఓబులవారిపల్లి మండల పరిధిలోని ఎపిఎండిసిలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలను ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానని రైల్వేకోడూరు టిడిపి ఇన్‌ఛార్జి ముక్కా రూపానందరెడ్డి, ఎమ్మెల్యే అరవ శ్రీధర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎపిఎండిసి అవుట్‌సోర్సింగ్, ట్రైనీ కార్మిక పోరాట సమితి జెఎసి ఆధ్వర్యంలో సుమారు 200 మంది కార్మికులు తమ సమస్యలను రూపానందరెడ్డి, ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. సంస్థలో చాలా కాలంగా దసరా పండుగ సందర్భంగా యాజమాన్యం కార్మికులకు ఇస్తున్న యూ నిఫాం, నగదును ఇంతవరకు ఇవ్వలేదని తెలిపారు. దీపావళి లోపు ఇవ్వ వలసిన ప్రాఫిట్ షేర్ కూడా ఇవ్వలేదని అన్నారు. శనివారం ఎండి తో చర్చిం చి న్యాయం చేస్తానని వారి హామీనిచ్చారు. కార్యక్రమంలో పోరాట కమిటీ జెఎసి కన్వీనర్ ఆర్.వెంకటేష్, వర్కర్స్ యూనియన్ నాయకులు బండారు భాస్కర్, పోరాట కమిటీ జె నాయకులు, యూనియన్ నాయకులు, 200 మంది కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొనడం జరిగింది.



రూపానందరెడ్డి, శ్రీధర్‌లకు సమస్యలు తెలుపుతున్న కార్మికులు

ప్రభుత్వ సంస్థలు.. ప్రజా సేవకు నిలయాలు



ప్రభుత్వ కార్యాలయ సందర్శనలో విద్యార్థులు

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని దలవాయిపల్లి ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న 4, 5 తరగతులు విద్యార్థులు శుక్రవారం పుల్లంపేట మండల కేంద్రంలోని వివిధ ప్రభుత్వ కార్యాల యాలను సందర్శించారు. మనకు ఎవరు సేవ చేస్తారు అనే పాఠ్యాంశంలో భాగంగా పుల్లంపేట మండల కేంద్రంలోని పోలీసు స్టేషన్, తహశీల్దార్ కార్యాలయం, ,మండల అభివృద్ధి అధికారి కార్యాలయం, స్త్రీశక్తి భవన్, మండల వనరుల కేంద్రం, గ్రంథాలయం, బ్యాంక్, పోస్ట్ ఆఫీసు, ఆయుర్వేద ఆసుపత్రి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, పశువుల ఆసుపత్రి, సచివాలయం లను సందర్శించి అక్కడ విధులు నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బంది అందిస్తున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. కార్యాలయాల్లో ఉన్న అధికారులు చాలా ఓపికగా పిల్లలకు అర్థమయ్యేలా తమ విధుల గురించి చక్కగా వివరించారు. ఈ సందర్భంగా ఎంఇఒలు చక్రధర్, నాగ తిరుమల రావు మాట్లాడుతూ తరగతి గదిలోనే కాకుండా ఇలా ప్రత్యక్షంగా పిల్లలు చూడటం వల్ల ఎప్పటికి గుర్తు ఉంటాయని అన్నారు. పిల్లలను వివిధ ప్రశ్నలు అడిగి జవాబులు తెలుసుకుని అభినందించారు. ఉపాధ్యాయులు వెంకట రమణ మాట్లాడుతూ పిల్లలు విన్నది మరచిపోవచ్చు, చూసింది గుర్తుంచుకుంటారని అన్నారు. తరగతి గది దాటి ఇలా ప్రభుత్వ కార్యాలయాలు సందర్శించడం పట్ల పలువురు అధికారుల పిల్లలను అభినందించారు. పిల్లలకు స్వీట్స్ ఇచ్చి ప్రోత్సహించడంతో విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు.

మేలైన యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు

- కెవికె కో-ఆర్డినేటర్ డాక్టర్ మంజుల

ప్రజాశక్తి కలికిరి

వేరుశనగ సాగులో మేలైన యాజమాన్య పద్ధతులు పాటించి రైతులు అధిక దిగుబడులు సాధించాలని కృషి విజ్ఞాన కేంద్రం, కలికిరి ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ డాక్టర్ కె.మంజుల పేర్కొన్నారు. శనివారం వేరుశనగ సాగు చేసే రైతులకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా రైతులు ముందస్తు ప్రణాళికతో, తగిన యాజమన్య పద్ధతులు పాటించి నపుడు రబీలో ఖచ్చితంగా 2టన్నులు కాయలు (50 బస్తాలు, బస్తా 40 కిలో లు బరువుకు సమానవం) దిగుబడి పొందవచ్చని చెప్పారు. నేల తయారీ, వేరుశనగ రకం, విత్తే సమయం, విత్తన మోతాదు, విత్తన శుద్ధి, మొక్కల సాంద్రత, విత్తే పద్ధతి, ఎరువుల యాజమాన్యం, కలుపు యాజమాన్యం, నీటి యాజమాన్యం, సమగ్ర సస్యరక్షణ, పంట కోత నిల్వను సిప్పార్సు మేరకు పాటిస్తే మంచి దిగుబడులు సాధించవచ్చని పేర్కొన్నారు. శాస్త్రవేత్త సోమశేఖర్‌బాబు మాట్లాడుతూ రబీ వేరశనగలో నవంబర్ నుంచి డిసెంబర్ 15 వరకు విత్తుకోవడానికి అనువైన సమయమని తెలిపారు. మొవ్వకుళ్ళు వైరస్, కాండం కుళ్ళు వైరస్ తెగులు ఆశించకుండా ఇమిడాక్లోప్రిడ్ 2మి.లీ. చొప్పున కిలో విత్తనానికి కలిపి విత్తన శుద్ధి చేయాలని అన్నారు. అరగంట తర్వాత కిలో విత్తనానికి 1గ్రాము చొప్పున టెబుకొనజోల్ ఇడియస్ (రాక్సిల్) లేదా మాంకోజబ్ 3 గ్రాముల చొప్పున కలిపి మొదలు కుళ్ళు, వేరుకుళ్ళు, కాండం కుళ్ళు తెగుళ్ళు ఎక్కువగా ఆశించే ప్రాంతాలలో కిలోవిత్తనానికి 4గ్రాముల ట్రైకోడెర్మా విరిడిని పట్టించాలని తెలిపారు. విత్త నాన్ని మొదట క్రిమిసంహారక మందుతో శుద్ధిచేసి, నీడలో ఆరబెట్టిన తర్వాత శిలీం ధ్రనాశనితో శుద్ధి చేయాలన్నారు. డాక్టర్ పీరూ సాహెబ్ మాట్లా డుతూ వేరు శనగలో ఆశించే పురుగులు, తెగుళ్ళ గురించి వివరించి వాటి నివారణ చర్య లపై అవగాహన కల్పించారు. డాక్టర్ కె.మాధురి మాట్లాడుతూ ఆచార్య ఎన్‌జి విశ్వవిద్యాలయం వారు అందిస్తున్న విస్తరణ సేవలు గురించి వివ రించారు. పంటల సాగు సందేహాలకు, శాస్త్రవేతల సలహాలు కొరకు 180042 50430 అను టోల్ ఫ్రీ నెంబర్‌కు లేదా 8008500320కు ఫోన్ చేయ వలసిందిగా కోరారు.



మాట్లాడుతున్న కెవికె కో-ఆర్డినేటర్ మంజుల

వాలంటీర్ నుంచి తన స్థలాన్ని ఇప్పించండి

- పోలీసులను ఆశ్రయించిన దళిత మహిళ

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్



ఇంటి స్థలం ముందు నిరసన తెలుపుతున్న కమల

తనకు ప్రభుత్వం మంజూరు చేసిన ఇంటి పట్టాను వైసిపి ప్రభుత్వ హయాంలో వాలం టీర్‌గా ఉన్న కృష్ణమూర్తి మార్పింగ్ చేసి కబ్జా చేసి ఇంటిని నిర్మించుకున్నాడని, తనకు న్యాయం చేయా లని కమల అనే దళిత మహిళ పేర్కొన్నారు. తనకు చేసిన మోసాన్ని తెలుసుకుని వాలంటీర్‌ను అడి గితే చంపుతానని బెదిరిస్తున్నాడని శుక్రవారం పోలీసులను ఆశ్రయించింది. బాధితురాలి కథనం మేరకు.. తంబళ్లపల్లె నియోజకవర్గంలోని కురబలకోట మండలం, సర్కారు తోపులో నివాసమున్న తనకు 2014లో (ఆర్ఓసి నెంబర్ 351/2014) అప్పటి కురబలకోట తహశీల్దార్ ఇంటి పట్టా మంజూరు చేసినట్లు తెలిపారు. తన భర్త వెంకటేష్ అనారోగ్యంతో మృతి చెందడంతో కూలి పనులు చేసుకుంటూ అద్దె ఇంట్లో ఉంటూ కుమారులు మోక్ష, వెంకట శివనాథ్ లను పోషించుకుంటున్నానని తెలిపారు. పనులు లేక బిడ్డల కోసం కేరళలో భిక్షాటనకు వెళ్లానని తిరిగి వచ్చేసరికి ప్రభుత్వం తనకు ఇచ్చిన ఇంటి స్థలాన్ని కృష్ణమూర్తి అనే వాలంటీర్ కబ్జా చేసి ఇంటిని నిర్మించుకున్నాడని ఆవే దన వ్యక్తం చేసింది. నిలదీసిన తనను చంపుతానని బెదిరిస్తున్నాడని చెప్పారు. తనకు న్యాయం చేయాలని రూరల్ సిఐను ఆశ్రయించింది. బాధి తురాలి ఫిర్యాదు మేరకు వాలంటీర్ వ్యవహారంపై విచారిస్తున్నట్లు సిఐ తెలిపారు.

రెవెన్యూ గ్రామసభకు 104 అర్జీలు

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

రీ సర్వే చేసిన భూములపై నెలకొన్న సమస్యలను పరిష్కరించడానికి రీసర్వే జరిగిన గ్రామాలలో గ్రామ సభలను నిర్వహిస్తున్నామని తహశీల్దార్ ధనంజయులు తెలిపారు. శుక్రవారం స్థానిక వారపు సంతలో నిమ్మనపల్లి-1 పరిధిలో స్థానిక సర్పంచ్ పాపులమ్మ మల్లప్ప, మాజీ సర్పంచ్ శ్రీరాములు, రీసర్వే డిటి సిరాజుద్దీన్, రెవెన్యూ ఇన్స్‌పెక్టర్‌లతో కలిసి గ్రామ సభను నిర్వహించినట్లు తెలిపారు. ఈ గ్రామ సభలో అత్యధికంగా రైతులు పాల్గొనగా, వారి నుంచి పట్టాదారు పాసు పుస్తకాల్లోని వివరాల్లో మార్పులు చేర్పులు, భూమి వ్యత్యాసాలు, బాగా పరిష్కారాలకు సంబంధించి అర్జీలు అందాయని తెలిపారు. రైతుల నుంచి 104 అర్జీలు స్వీకరించామని, వీటినెంత త్వరగా రైతుల సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి ప్రతి సమస్యను పరిష్కరిస్తామని చెప్పారు. రీ సర్వే భూములపై నిర్వహిస్తున్న గ్రామసభల్లో రైతుల పాల్గొని నిర్మోహమాటంగా వారి సమస్యలను తమ దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు రాంప్రసాద్, పంచాయతీ కార్యదర్శి వెంకటరమణారెడ్డి, విఆర్ఒలు శ్రీనివాసులు, సచివాలయ సర్వేయర్లు, రైతులు పాల్గొన్నారు.

బ్యాంకు సేవలపై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి-చిన్నమండెం

మండల పరిధిలోని స్థానిక ఆదర్శ పాఠశాల, జూనియర్ కాలేజీ విద్యార్థులకు శుక్రవారం చిన్నమండెం స్టేట్ బ్యాంక్‌లో బ్యాంకు సేవలపై విద్యా ర్థులకు బ్యాంకు సిబ్బంది అవ గాహన కల్పించారు. వృత్తి విద్యలో శిక్షణ పొందు తున్న విద్యార్థులు ఇండస్ట్రియల్ విజిట్ శిక్షణలో భాగంగా ట్రైనర్ చింతల సాయినాథ్ ఆధ్వర్యంలో విద్యార్థులు ర్యాలీగా వచ్చి బ్యాంకును సందర్శించారు. ఈ సందర్భంగా బ్యాంకు మేనేజర్, సిబ్బంది బ్యాంకింగ్ వ్యవస్థ పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఖాతా ఎలా తెరవాలి, నగదు ఎలా జమ చేయాలి, నగదు ఎలా విత్ డ్రా చేయాలోవిద్యార్థులకు తెలియజేశారు. రుణాల రకాలు, డిపాజిట్ల రకాలు, ఉచిత బ్యాంకు లావాదేవీల గురించి వివరించారు. ప్రస్తుతం యుపిఐ మొబైల్ నెట్ బ్యాంకింగ్ గురించి, సైబర్ నేరాల బారిన పడకుండా ఎలా జాగ్రత్తలు తీసుకోవాలో విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ వి.రమేష్ ఉపాధ్యా యుల గోపాల్, ఆరిఫ్, ఇక్బాల్, మోహన్ రెడ్డి, భాగ్యవతి, విద్యార్థులు పాల్గొన్నారు.

మదనపల్లెలో పేలిన ఎలక్ట్రిక్ బైక్

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మదనపల్లెలో ఛార్జింగ్ పెట్టిన ఓ ఎలక్ట్రిక్ బైక్ గురువారం అర్ధ రాత్రి పేలి పోయిందని మదనపల్లె అగ్నిమాపక అధికారి శివప్ప శుక్రవారం తెలిపారు. శివప్ప కథనం మేరకు.. దేవతనగర్ కు చెందిన సుబ్రహ్మణ్యంరెడ్డి తన ఎలక్ట్రిక్ బైక్‌కు రాత్రి ఛార్జింగ్ పెట్టి నిద్రించాడని చెప్పారు. కొద్ది సేపటికే బైకులో మంటలు చెలరేగి కాలిపోసాగిందని అన్నారు. వెంటనే బాధితుడు అగ్నిమాపక సిబ్బందికి ఫోన్ చేసి సమాచారం అందించాడని తెలిపారు. సిబ్బందితో సంఘటనా స్థలంకు చేరుకుని మంటలను అదుపు చేసినట్లు చెప్పారు. అప్పటికే బైకు పూర్తిగా కాలిపోవడంతో సుమారు రూ.1.50 లక్షలు నష్టం జరిగినట్లుగా నిర్ధారించారు. అనంతరం యజమాని ఫిర్యాదుతో కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు అగ్ని మాపాక అధికారి శివప్ప తెలిపారు.

చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి : సిఐ

ప్రజాశక్తి-పీలేరు

విద్యార్థులు, యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ తల్లిదండ్రుల కలలను నిజం చేయడంతో పాటు దేశాభివృద్ధికి పాటుపడాలని పీలేరు అర్బన్ సిఐ యుగంధర్ తెలిపారు. శుక్రవారం ఆయన స్థానిక సంజయ్ గాంధీ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు మత్తు పదార్థాల దుష్పలితాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ మూడు రోజుల క్రితం స్థానిక మోడల్ కాలనీ సమీపంలో జరిగిన రెలు ప్రమాదంలో మృతి చెందిన విద్యార్థుల ఉదంతాన్ని గుర్తుకు చేశారు. పిల్లల భవిష్యత్తు, అభివృద్ధికి తల్లిదండ్రులతో పాటు అధ్యాపకులు కూడా ఎంతో కృషి చేస్తున్నారని అన్నారు. వారి ఆశలు, మీ ఆశయాలు వృధా కాకుండా సమాజ శ్రేయస్సు, దేశ అభ్యున్నతి కోరుకుని ముందుకు వెళ్లాలని హితవు పలికారు. కార్యక్రమంలో స్థానిక ఎస్ఐ బాలకృష్ణ, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సుధాకర్‌రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు, మహిళా పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

డయల్ యువర్ డిఎం

ప్రజాశక్తి-పీలేరు

పీలేరు ఆర్టీసీ డిపోలో నిర్వహించిన డైల్ యువర్ డిఎం కార్యక్రమానికి మంచి స్పందన లభించిందని డిపో మేనేజర్ బండ్ల కుమార్ తెలిపారు. శుక్రవారం జరిపిన ఈ కార్యక్రమంలో పీలేరు, సమీప గ్రామాల నుంచి పలువురు ఫోన్ కాల్స్ చేశారని అన్నారు. పీలేరుకు చెందిన పి.రవి ఫోన్ చేసి తిరుపతి నుంచి పీలేరుకు రాత్రి 10 గంటల తరువాత బస్సులు లేవని, రాత్రి .30 గంటలకు పల్లె వెలుగు బస్సు సర్వీస్ ఉంటుందని ఆ తర్వాత బయటి డిపోలకు సంబంధించిన ఎక్స్‌ప్రెస్ బస్సు సర్వీసులు మాత్రమే ఉంటాయని తెలిపారన్నారు. స్థానిక కోటపల్లికి చెందిన ఎం. గిరినాథ్ రెడ్డి ఫోన్ చేసి పీలేరు నుంచి పుంగనూరుకు బస్సు సర్వీసులు నడపాలని కోరినట్లు చెప్పారు. ఇందుకు స్పందించిన డిపో మేనేజర్ పీలేరు నుంచి పుంగనూరుకు ఉదయం 7.45 గంటలకు, మధ్యాహ్నం 1.45కు, సాయంత్రం 5 గంటలకు పుంగనూరు డిపో బస్సు సర్వీసులు నడుపుతున్నారని తెలియపరిచామన్నారు. పీలేరు మండలంలోని రేగళ్ళు పంచాయతీ, జలాల్ సాహెబ్ వారిపల్లికి చెందిన సయ్యద్‌బాషా ఫోన్ చేసి పీలేరు, రేగళ్లు, కలికిరి మధ్య బస్సులు నడపాలని కోరారన్నారు. రెండు మూడు రోజుల్లో బస్సులు నడపడానికి చర్యలు తీసుకుంటామని తెలియజేసినట్లు చెప్పారు.

రేషన్ డీలర్ల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

అన్నమయ్య జిల్లాలో రేషన్ డీలర్లు ఎదుర్కొంటున్న సమస్యలను కూటమి ప్రభుత్వం పరిష్కరించాలని రేషన్ డీలర్ల అసోసియేషన్ గౌరవాధ్యక్షులు కలకడ కళాధర్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. డీలర్లకు రావాల్సిన కమీషన్ బకాయిలు వెంటనే చెల్లించాలన్నారు. ఈ విష యమై ముఖ్యమంత్రి చంద్రబాబు, రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌తో చర్చి స్తామని చెప్పారు. గత ఐదేళ్లు రేషన్ డీలర్లు తీవ్ర ఇబ్బందులు పడ్డారని, కొత్త ప్రభుత్వం డీలర్ల సమస్యలను గుర్తించి పరిష్కరించాలని కోరారు. తనను గౌరవాధ్యక్షుడిగా ఎన్నుకోవడంతో బాధ్యత మరింత పెరిగిందని, డీలర్ల సంక్షేమం కోసం కృషి చేస్తానని తెలిపారు. తనను ఎన్నుకుని ఈ అవకాశం కల్పించిన రేషన్ డీలర్లకు ధన్యవాదాలు తెలిపారు.



రికార్డులు పరిశీలిస్తున్న డాక్టర్ ఉషశ్రీ

వ్యాధి నిరోధక టీకాలపై అవగాహన పెంచుకోవాలి

ప్రజాశక్తి-కలకడ

వ్యాధి నిరోధక టీకాల శిక్షణ కార్యక్రమాన్ని శుక్రవారం జిల్లా వ్యాధి నిర్మూలన టీకాల అధికారి డాక్టర్ ఉషశ్రీ తనిఖీ చేశారు. మండలంలోని ఎర్రకోటపల్లి ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో వార్డులు, ల్యాబ్, కాన్పుల గదిని పరిశీలించారు. పిహెచ్‌సిలో పని చేయుచున్న ఎంఎల్‌హెచ్ పిలు, ఎఎన్ ఎంలు, ఆశా కార్యకర్తలకు డాక్టర్ యం.వి.కిషోర్‌కుమార్‌రెడ్డి, డాక్టర్ పి.జవ హర్‌బాబు, సిహెచ్ఒ నారాయణ, ఎంపిహెచ్ఇఒ జయరామయ్య ఆధ్వ ర్యంలో శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. సాధారణ వ్యాధి నిరోధక టీకాల కార్య క్రమాన్ని ఎలా నిర్వహించాలి, ప్రణాళికలు ఎలా తయారు చేసుకోవాలి, లబ్దిదారుల సర్వే ఎలా చేయాలి, వాటికి సంబంధించిన వివరాలు ఎలా అప్ డేట్ చేయాలో వివరించినట్లు తెలిపారు. లబ్ధిదారులకు వ్యాక్సిన్ ఎంత కావా లని అంచనా వేయడంతో పాటు లాజిస్టిక్స్ ఎన్ని కావాలి, కోవిడ్ అనంతరం టీకాల జాబితా లో చేర్చిన వ్యాక్సిన్స్ గురించి తెలియజేశారు.కార్యక్రమంలో సిహెచ్ఒ నారాయణ, ఎంపిహెచ్ఇఒ జయరామయ్య, పిహెచ్ఎన్ సుబ్బ రత్న, పర్యవేక్షకులు రెడ్డెమ్మ, వెంకటేశ్వరరావు, ఆరోగ్య కార్యకర్తలు, ఎంఎల్ హెచ్‌పిలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

మల్లికార్జున స్వామి సన్నిధిలో ఆర్‌టిసి ఆర్‌ఎం

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

మల్లయ్య కొండపై వెలసిన శ్రీ భ్రమరాంబికా సమేత మల్లికార్జున స్వామిని ఆర్‌టిసి రీజనల్ మేనేజర్ పి.రాము కుటుంబ సభ్యులతో శుక్రవారం దర్శించుకున్నారు. ఆలయ పూజారి ఈశ్వరప్ప స్వాగతం పలికారు. స్వామివారికి ప్రత్యేక అలంకరణ పూజలు, అభిషేకాలు నిర్వహించారు. వారికి స్వామి వారి దర్శనం కల్పించి తీర్థ ప్రసాదాలు అందించారు. అనంతరం ఆర్‌టిసి సేవల గురించి భక్తులను అడిగి తెలుసుకున్నారు. భక్తుల కోరిక మేరకు మల్లయ్య కొండకు అదనపు బస్సు సర్వీసు ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తానని చెప్పారు.

క్రైం కార్నర్

రెండు బైక్‌లు ఢీ : ఒకరు మృతి

- మరొకరికి గాయాలు

ప్రజాశక్తి-రామాపురం

మండల పరిధిలోని కుమ్మరపల్లి పంచాయితీ, సురకవాండ్లపల్లి సబ్ స్టేషన్ పరిధిలోని గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో రెండు బైకులు ఢీకొని హరినాథ్(46) అనే వ్యక్తి తిరుపతి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందగా మరో వ్యక్తి సయ్యద్ నూర్‌భాషాకు తీవ్ర గాయాలు అయినట్లు ఎస్ఐ వెంకట సుధాకర్‌రెడ్డి తెలిపారు. పోలీసుల కథనం మేరకు.. కుమ్మరపల్లి పంచాయతీ సూరకవాండ్లపల్లె చెందిన పల్లహరినాథ్ రాయచోటి చికెన్ సెంటర్‌లో పనిచేసేవాడని తెలిపారు. రోజు మాదిరే పని ముగించుకొని బైక్‌పై ఇంటికి వెళుతుండగా మార్గమధ్యలోనే డాక్టర్ జనార్దన్‌రెడ్డి తోట వద్దకు రాగానే వెనక వైపు లక్కిరెడ్డిపల్లెకు చెందిన సయ్యద్ నూర్‌బాషా రాయచోటి నుంచి లక్కిరెడ్డిపల్లికు ముందు వెళ్లే బైక్‌ను ఢీకొట్టాడని తెలిపారు. ఈ సంఘటనలో పల్లా ఇద్దరికి తీవ్రగాయాలు అయ్యాయని తెలిపారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని బాధితులను 108 ద్వారా రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించరాని అన్నారు. పల్లా హరినాధకు మెరుగైన చికిత్స కోసం తిరుపతి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడని తెలిపారు. నూర్ భాషాను కడప కడప రిమ్స్ కు తరలించి నట్లు తెలిపారు. మృతునికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

లారీ ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

లారీ ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన మండల పరిధిలోని ఊటుకూరు మలుపు వద్ద జరిగింది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. శుక్రవారం తిరుపతి నుంచి బళ్ళారి వెళ్ళుతున్న లారీ రోడ్డు పక్కన ఆగి ఉన్న బైక్‌ను ఢీ కొన్న ఘటనలో రాజంపేట సత్య షోరూంలో మేనేజర్‌గా ఉద్యోగం చేస్తున్న అయ్యావారిపల్లికి చెందిన తుర్రా విక్రమ్ తీవ్రంగా గాయపడినట్లు తెలిపారు. ఎడమ కాలు విరగడంతో చికిత్స నిమిత్తం రాజంపేట ప్రభుత్వ ఆస్ప త్రికి తరలించారని అన్నారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తరలించి నట్లు తెలిపారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

హత్య కేసు కొట్టివేత

ప్రజాశక్తి-సుండుపల్లి



నిర్దోషులుగా విడుదలైన తిమ్మయ్య, రెడ్డిచర్ల రామకృష్ణ

మండలంలోని పెద్దగొల్లపల్లెకు చెందిన బుట్టిమాని తిమ్మయ్య అనే వ్యక్తిని అతని స్నేహితులైన తిమ్మయ్య, రెడ్డిచర్ల రామకృష్ణ హత్య చేశారని ఆరోపణపై నమోదైన కేసును రాయచోటి ఐదవ అదనపు జిల్లా జడ్జి కృష్ణన్ కుట్టి శుక్రవారం కొట్టివేశారు. కోర్టు సిబ్బంది అందించిన వివరాల మేరకు.. సుండుపల్లి మండలం పెద్ద గొల్లపల్లికు చెందిన బుట్టి మాని తిమ్మయ్య , రెడ్డిచర్ల రామకృష్ణ, బుట్టిమాని చిన్నప్ప సోదరుడైన తిమ్మయ్య ముగ్గురు ప్రాణ స్నేహితులని తెలిపారు. ముగ్గురు కలిసిమెలిసి ఉండేవారని చెప్పారు. చిన్నప్ప సోదరుడైన తిమ్మయ్యకు అదే గ్రామానికి చెం దిన ఎర్రయ్యకు 2019 సంవత్సరం, నవంబర్ నెలలో భూమి తగాదాలు వచ్చాయని తెలిపారు. చిన్నప్ప సోదరుడైన హతుడు తిమ్మయ్య ఎర్రగొల్ల ఎర్రయ్యకు అనే వ్యక్తికి మద్దతు తెలిపాడని, మొదటి నిందితుడైన బుట్టివాని తిమ్మయ్య, రెండవ నిందితుడు రెడ్డిచర్ల రామకృష్ణ కలిసి ఒక పతకం ప్రకారం రెడ్డిచర్ల రామకృష్ణ ఇంటిలో 2019 నవంబర్ 7న హత్య చేశారని, సుండుపల్లి పోలీసులు హత్య కేసుగా నమోదు చేశారని తెలిపారు. పోలీసుల విచారణ ప్రకారం హతుడైన తిమ్మయ్యను రెండవ నిందితుడు రెడ్డిచర్ల రామకృష్ణ చేతులు విరిచి వెనక్కి పట్టుకోగా మొదటి నిందితుడు బుట్టిమాని తిమ్మయ్య రోకలి బడితో తలపై బాధడంతో అక్కడికక్కడే కుప్ప కూలిపో యినట్లు పోలీసులు కోర్టుకు నివేదించారు. ఈ కేసు పై పూర్తి విచారణ చేసిన అనంతరం పోలీసులు కేసును రుజువు చేయడంలో విఫలమయ్యారని రాయచోటి ఐదవ అదనపు జిల్లా జడ్జి కృష్ణన్ కేసును కుట్టి కొట్టేశారు. నిందితుల తరపున న్యాయవాది టి.ఈశ్వర్, పి.రెడ్డయ్య వాదించారు.

ఇటుకల లారీ బోల్తా

- బీహార్ కూలీలకు తీవ్ర గాయాలు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

పట్టణంలోని విజయనగర్ కాలనీ మిట్టపై శుక్రవారం ప్రమాదవశాత్తు ఇటుకల ట్రాక్టర్ బోల్తా పడింది. ఈ ప్రమాదంలో బీహార్ రాష్ట్రానికి చెందిన కూలీలు తీవ్రంగా గాయపడ్డారు. టూ టౌన్ పోలీసుల కథనం మేరకు..పట్టణంలోని సిటియం రోడ్, తట్టివారిపల్లి వద్ద ఉన్న ఓ ఇటుకుల ఫ్యాక్టరీలో బీహార్ కార్మికులు పని చేస్తున్నారు. పట్టణంలోని గొల్లపల్లి మిట్టపై నిర్మాణంలో ఉన్న సిమెంట్ రోడ్డుకు ట్రాక్టర్‌లో ఇటుకులు లోడు వేసుకుని వెళ్లారు. మిట్టపైన ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో ట్రాక్టర్‌లో ఉన్న బీహార్ కూలీలు ఇటుకుల కింద పడి తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు బాధితులను కాపాడి జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు వారిని ఆస్పత్రిలో చేర్చి మెరుగైన వైద్య చికిత్సలు అందిస్తున్నారు. ఎలాంటి ప్రాణ నష్టం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి పరిస్థితిని సమీక్షించారు. గాయపడిన వారందరూ బీహార్‌కు చెందిన వారుగా గుర్తిం చారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.